

12 నుంచి హనుమత్ జయంతి

విజయవాడ కల్చరల్: 12 నుంచి మూడు రోజులపాటు విజయవాడలో హనుమత్ జయంతి నిర్వహిస్తున్నట్లు ధర్మప్రచార పరిషత్ ప్రోగ్రాం ఇన్‌చార్జి ప్రసాద్ తెలిపారు.



నిమ్మకాయల ధరలు

తెనాలిటౌన్: స్థానిక మార్కెట్‌యార్డులో మంగళవారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.1500, గరిష్ట ధర రూ.3,800, మోడల్ ధర రూ.2,300 వరకు పలికింది.



మహాయజ్ఞం ఏర్పాట్ల పరిశీలన

విజయవాడ స్పోర్ట్స్: ఇందిరాగాంధీ స్టేడియంలో ఈనెల 12 నుంచి 17వ తేదీ వరకు జరిగే రాజశ్యామలయజ్ఞం ఏర్పాట్లనుమంత్రి కొట్టు సత్యనారాయణ పరిశీలించారు.

న్యూస్‌రీల్

నేడు సాక్షి ఆధ్వర్యంలో ఉచిత చెస్ శిక్షణ

గుంటూరు వెస్ట్: క్రీడలను ప్రోత్సహించే లక్ష్యంతో సాక్షి ఆధ్వర్యంలో బుధవారం ఉదయం 9 గంటల నుంచి స్థానిక బ్రాడీపేట 3/11 మాస్టర్‌మైండ్స్ బాలాజీ క్యాంపస్ (వజ్రం హోటల్ వెనుక)లో ఉచిత ప్రత్యేక చెస్ శిక్షణ కార్యక్రమం జరగనుంది. మాస్టర్‌మైండ్స్ సౌజన్యంతో నిర్వహించనున్న ఈ కార్యక్రమంలో పేరొందిన శిక్షకులచే మెలకువలు నేర్పుతారు. అయితే ఎవరి చెస్ బోర్డ్ వారే తెచ్చుకోవాల్సి ఉంటుంది. వయోపరిమితి లేదు. ముందుగా వచ్చిన 30 మందికి మాత్రమే అవకాశం. ఉచితంగా శిక్షణనివ్వడంతోపాటు పార్టిసిపేషన్ సర్టిఫికెట్, ప్రోత్సాహక బహుమతి కూడా ఇవ్వడం జరుగుతుంది. పేర్లు రిజిస్ట్రేషన్ చేయించుకునేందుకు అంజిబాబు సెల్ నెంబర్ 92484 45648 సంప్రదించగలరు.

సహకార సంఘాలు బలోపేతం చేయాలి

ఏపీ సహకార యూనియన్ రాష్ట్ర చైర్మన్ రాఘవరెడ్డి




కొరిటిపాడు (గుంటూరు): ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల (పీఏసీఎస్)ను బలోపేతం చేయాలని ఆంధ్రప్రదేశ్ సహకార యూనియన్ రాష్ట్ర చైర్మన్ డి.రాఘవరెడ్డి సూచించారు. స్థానిక బ్రాడీపేటలోని జీడీసీసీ బ్యాంక్ సమావేశ మందిరంలో పీఏసీఎస్ చైర్‌పర్సన్లు, సీఈఓలకు మంగళవారం ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రైతులకు సకాలంలో పంట రుణాలు అందించడంతో పాటు రైతులకు విస్తృత సేవలు అందించాలన్నారు. జిల్లా సహకార అధికారి వీరాచారి మాట్లాడుతూ రైతుల ప్రతినిధులుగా ఉన్న పీఏసీఎస్ చైర్‌పర్సన్స్ రైతుల ఆర్థికాభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో జీడీసీసీ బ్యాంక్ సీఈఓ టి.కృష్ణవేణి, ఆప్కాబ్ ప్రతినిధి కె.విజయలక్ష్మి, సహకారశాఖ అధికారులు నిర్మల, ఎం.రామ్మోహన్, కోటేశ్వరరావు, వేదాంత రెడ్డి, పీఏసీఎస్ చైర్‌పర్సన్స్, సీఈఓలు పాల్గొన్నారు.

నేడు పాలిసెట్-2023

గుంటూరు నగరంలో 14 కేంద్రాలు, 5,383 మంది విద్యార్థులు

గుంటూరు ఎడ్యుకేషన్: పాలిటెక్నిక్ కోర్సుల్లో ప్రవేశానికై బుధవారం జరగనున్న పాలిసెట్-2023కు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్ష జరగనుండగా, విద్యార్థులను ఉదయం 10 గంటల నుంచి 11 గంటల వరకే పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించనున్నారు. గుంటూరు జిల్లా వ్యాప్తంగా దరఖాస్తు చేసిన 5,383 మంది విద్యార్థులకు గుంటూరు నగర పరిధిలోని వివిధ విద్యాసంస్థల్లో 14 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. విద్యార్థులు హాల్ టిక్కెట్, బాల్ పాయింట్ పెన్, హెచ్‌బీ పెన్సిల్, ఎరేజర్, షార్ప్‌నర్ వైట్ తీసుకుని వెళ్లాలని, ఇవి మినహా సెల్‌ఫోన్, కాలిక్యులేటర్ వంటి ఎలక్ట్రానిక్ పరికరాలు అనుమతించబోమని పాలిసెట్-2023 గుంటూరు జిల్లా సమన్వయకర్త తాళ్లూరి శేఖర్ పేర్కొన్నారు. పాలిసెట్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని ఆయన చెప్పారు. పరీక్షా కేంద్రాల్లో తాగునీరు, వైద్య సేవలతో పాటు విద్యుత్ సరఫరాలో అవాంతరాలు లేకుండా ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు చేరుకునేందుకు ఆర్టీసీ అధికారులు ఆయా రూట్లలో బస్సులను నడపనున్నట్లు తెలిపారు.

యార్డులో 1,03,067 బస్తాల మిర్చి విక్రయం



కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు మంగళవారం 98,220 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 1,03,067 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నెంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల మిర్చి సగటు ధర రూ.9,000 నుంచి రూ.22,500 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగి, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.9,000 నుంచి రూ.24,000 వరకు పలికింది. తాలు రకం మిర్చికి రూ.6,000 నుంచి రూ.13,500 వరకు ధర లభించింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 59,204 బస్తాలు మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

కొత్త బండి.. భద్రత దండి

హై సెక్యూరిటీ ప్లేట్ తప్పనిసరి
- కొత్తవాహనాలకు 'సుప్రీం' ఆదేశాలు
- హెచ్‌ఎస్‌ఆర్‌పీపై స్పెషల్ డ్రైవ్‌లు
- సిద్ధమవుతున్న రవాణ శాఖ
- ఇప్పటికే వాహన డీలర్లకు మార్గదర్శకాలు



హై సెక్యూరిటీ రిజిస్ట్రేషన్ ప్లేట్ (ట్రాన్స్‌పోర్ట్, నాన్‌ట్రాన్స్‌పోర్ట్)

పట్నంబజారు: నూతన వాహనం కొనుగోలు చేస్తున్నారా? అయితే ఇకపై హై సెక్యూరిటీ రిజిస్ట్రేషన్ ప్లేట్ (హెచ్‌ఎస్‌ఆర్‌పీ) ఎంతో అవసరమనే విషయాన్ని గమనించండి. ఎన్నో ప్రయోజనాలు ఒనగూరే హెచ్‌ఎస్‌ఆర్‌పీని ప్రతి ఒక్కరూ తప్పని సరిగా అమర్చుకోవాలని రవాణ శాఖ అధికారులు స్పష్టం చేస్తున్నారు. తద్వారా అనేక అంశాల్లో నెంబర్ ప్లేటు ద్వారా యజమానికి మేలు జరుగుతుందని చెబుతున్నారు.

2013 లోనే 'సుప్రీం' ఆదేశాలు

హై సెక్యూరిటీ రిజిస్ట్రేషన్ ప్లేట్ (హెచ్‌ఎస్‌ఆర్‌పి) అమర్చుకోవాలని 2013 సంవత్సరంలో సుప్రీంకోర్టు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ఈ విధానాన్ని అమలు చేయాలని ఆర్టీవోకు కేంద్ర ప్రభుత్వం సూచనలు చేసింది. అయితే హెచ్‌ఎస్‌ఆర్‌పీల అమలు ఇప్పటి వరకు మందకొడిగా సాగిందనే చెప్పాలి. ఈ క్రమంలో వీటి ప్రాధాన్యత గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం గత ఏడాది కొనుగోలు చేసిన ప్రతి నూతన వాహనంతో పాటు, పాత వాహనాలకు కూడా అమర్చాలని ఆదేశాలు జారీ చేయటంతో అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు.

వాహనాల సంఖ్య ఇలా...

గుంటూరు జిల్లాలో మొత్తం ట్రాన్స్‌పోర్ట్ వాహనాలు 1 లక్ష 5,980 వాహనాలు ఉండగా, వాటిలో లారీలు 24,936, మ్యాక్సీ క్యాబ్‌లు 1389, మెటార్ క్యాబ్‌లు 6121, ట్రాక్టర్లు 16,179, ఆటోలు 28,390, అంబులెన్స్‌లు 839, స్కూల్ బస్సులు 2897తో ఇతర వాహనాలు అనేకమున్నాయి. వీటితో పాటుగా నాన్‌ట్రాన్స్‌పోర్ట్ వాహనాలు సుమారుగా 6.50 లక్షల నుంచి 7లక్షల వరకు ఉండే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.

జిల్లా వ్యాప్తంగా ఉన్న వాహనాలకు హెచ్‌ఎస్‌ఆర్‌పీలను తప్పని సరిగా బిగించేందుకు దృష్టి సారిస్తున్నారు.

ఇంటి నుంచి మొదలు పెట్టి..

జిల్లా వ్యాప్తంగా స్పెషల్ డ్రైవ్ నిర్వహించేందుకు సిద్ధమవుతున్న ఆర్టీవో అధికారులు కార్యక్రమాన్ని ఇంటి నుంచే మొదలు పెట్టారు. ముందుగా వారి శాఖలోని వాహనాలకే నెంబరు ప్లేట్లు అమర్చటం ప్రారంభించారు. వీటితో పాటు రెన్యువల్, త్రైమాసిక పన్నులు చెల్లించేందుకు వచ్చిన ట్రాన్స్‌పోర్ట్ వాహనదారులు నెంబరు ప్లేటు బిగించుకున్న తరువాతనే వాటిని రెన్యువల్ చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ కార్యాలయాలు, ఇతర వ్యాపార సముదాయాల కలిసి హెచ్‌ఎస్‌ఆర్‌పీ అమర్చుకోవాలని సూచనలు చేసేందుకు సిద్ధమయ్యారు. వాహన షోరూం యజమానులకు సైతం ఖచ్చితంగా సెక్యూరిటీ నెంబర్ ప్లేటు బిగించేలా దృష్టి సారించాలని ఆదేశాలు జారీ చేశారు.

మార్గదర్శకాలు పాటించాలి



ప్రతి ఒక్కరూ ఖచ్చితంగా సుప్రీంకోర్టు, ప్రభుత్వ మార్గదర్శకాలను పాటించాలి. వారి వాహనాలకు తప్పని సరిగా హెచ్‌ఎస్‌ఆర్‌పీ నెంబర్లు పేట్లు అమర్చుకోవాలి. తద్వారా ఎంతో మేలు జరుగుతుందనే అంశాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించాలి. ఇప్పటికే ప్రభుత్వ శాఖకు విజ్ఞప్తి చేయటంతో పాటు, ఆర్టీవోలో ప్రతి అధికారి, సిబ్బంది హెచ్‌ఎస్‌ఆర్‌పీ ప్లేటును అమర్చేలా చర్యలు తీసుకున్నాం. దీనిపై స్పెషల్ డ్రైవ్ ప్రారంభించటంతో పాటు, ప్రతి ఒక్కరిలో అవగాహన కల్పించేలా చర్యలు తీసు కుంటున్నాం.

-షేక్ కరీం, డీటీసీ, గుంటూరు జిల్లా

పలు ప్రయోజనాలు

- ప్రత్యేక పోగ్రామ్ ద్వారా ఏర్పాటు చేసిననెంబర్ ప్లేటులోనే చాసిస్ నెంబర్‌తో పాటు అనేక అంశాలు పొందుపరిచి ఉంటాయి.
- వాహనం చోరీ అయిన సమయంలో సైతం ఆ సెక్యూరిటీ ప్లేటును విరగ్గొట్టం అంత తేలిక కాదు
- నెంబర్ ప్లేటును తొలగించినా.. గుర్తుతెలియని దుండగలు చోరీ చేసినా పసిగట్టవచ్చు.
- అధికారుల తనిఖీ సమయంలో ఇంజన్‌పై ఉండాల్సిన చాసిస్ నెంబర్ లేకపోవటం, నెంబర్ ప్లేటు మార్పు ఉండటాన్ని ఎంతో తేలిగ్గా గుర్తించవచ్చు.
- హెచ్‌ఎస్‌ఆర్‌పీ ప్లేటు కోసం ''ఏపీఆర్టీఏ సిటిజన్.ఈ ప్రగతి.ఓఆర్‌బి సైట్‌లో స్లాట్ బుక్ చేసుకోవచ్చు.
- తద్వారా రోజుల వ్యవధిలోనే నెంబర్ ప్లేటు అందుతుంది.
- ఆన్‌లైన్‌లో చేసుకోలేని వారు ఆర్టీవో కార్యాలయం, వాహన షోరూమ్‌ల్లో సంప్రదించాలని అధికారులు సూచిస్తున్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న ప్రిన్సిపల్ సెక్రటరీ ఇంతియాజ్, ఎంపీ ఆళ్ల, కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి, మేయర్ కావటి, శాసన సభ్యులు కిలారి, ముస్తఫా, ఎమ్మెల్సీ హనుమంతరావు, ఎస్పీ ఆరిఫ్ హాఫీజ్

ప్రభుత్వ సేవల్లో... మరింత పారదర్శకత

- సమస్యలకు సత్వర పరిష్కారం
- కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి
- ఘనంగా జగనన్నకు చెబుదాం కార్యక్రమం
- ఏ సమస్య ఉన్నా కాల్ 1902

గుంటూరు వెస్ట్: గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా ప్రభుత్వ సేవలను గ్రామ స్థాయికి చేర్చిన రాష్ట్ర ప్రభుత్వం మరో అడుగు ముందుకు వేయడం ద్వారా ప్రజా సమస్యల పరిష్కారం మరింత పారదర్శకతంగా, వేగంగా అందేందుకు దోహదపడతాయని కలెక్టర్ ఎం. వేణుగోపాల్ రెడ్డి తెలిపారు.

మంగళవారం క్యాంపు కార్యాలయం నుంచి ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి స్థానిక కలెక్టరేట్ నుంచి కలెక్టర్ మాట్లాడుతూ నాలుగేళ్లుగా స్పందన కార్యక్రమం ద్వారా ఎన్నో సమస్యలకు సత్వర పరిష్కారం లభించిందన్నారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో భాగంగా ప్రజలు ఏ సమయంలోనైనా 1902 నెంబర్‌కు ఫోన్ చేసి తమ సమస్యలను వివరించవచ్చున్నారు. సమస్య పరిష్కారమయ్యే వరకు దానిని ట్రాకింగ్ చేస్తారని చెప్పారు. ఒక విధంగా ప్రజల సమస్యల పరిష్కారంలో ఇదొక విప్లవాత్మకమైన మార్పని కొనియాడారు. నిత్యం ప్రజలతో ఉండడమే కాకుండా వారి సమస్యల పరిష్కారం తమ బాధ్యతగా భావించే ముఖ్యమంత్రి ఆశయాలను ముందుకు తీసుకెళతామని తెలిపారు.

జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి జిల్లాకు ప్రత్యేకాధికారిగా మైనార్టీ సంక్షేమ శాఖ పిన్సిపల్ సెక్రటరీ ఇంతియాజ్ అహ్మద్‌ను నియమించారని కలెక్టర్ వివరించారు. ప్రతి నెలా రెండు సమావేశాలు నిర్వహించి ఎప్పటికప్పుడు మార్పులు చేర్పులు చేస్తారని చెప్పారు. కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు ఆళ్ల అయోధ్య రామిరెడ్డి, శాసన సభ్యులు కిలారి వెంకట రోశయ్య, మొహమ్మద్ ముస్తఫా, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, నగర మేయర్ కావటి మనోహర్ నాయుడు, జీడీసీసీ బ్యాంక్ చైర్మన్ రాతంశెట్టి సీతా రామాంజనేయులు (లాల్‌పురం రాము), చేనేత కార్పొరేషన్ చైర్మన్ గంజి చిరంజీవి, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ మందపాటి శేషగిరిరావు, వికలాంగులు, వయోవృద్ధుల కార్పొరేషన్ చైర్‌పర్సన్ ముంతాజ్ పఠాన్, కుమ్మరి శాలివాహన కార్పొరేషన్ చైర్మన్ మండేపూడి శేషగిరిరావు, పూసల కృష్ణ బలిజ కార్పొరేషన్ చైర్‌పర్సన్ కోలా భవాని, డిప్యూటీ మేయర్ షేక్ సజీల, జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి, ఏఎస్పీ కె.సుప్రజ, వైఎస్సార్‌సీపీ నాయకుడు గులాం రసూల్, ఆర్‌అండ్‌బీ డైరెక్టర్ పిల్లిమేరి, టిడ్కో డైరెక్టర్ కె.నాగేశ్వరి, క్రిస్టియన్ కార్పొరేషన్ డైరెక్టర్ మనోరంజని పాల్గొన్నారు.

లేఅవుట్లలో పనులు వేగవంతం చేయాలి

జిల్లా జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి

మంగళగిరి: సీఆర్‌డీఏ పరిధిలోని పేదలకు కేటాయించిన నివేశన స్థలాల్లో చేపట్టిన లేఅవుట్‌ల అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి అన్నారు. మంగళవారం ఆమె అసిస్టెంట్ కలెక్టర్ శివనారాయణ శర్మతో కలసి నగర పరిధిలోని నిడమర్రులో పేదలందరికీ కేటాయించిన లేఅవుట్ అభివృద్ధి పనులను పరిశీలించారు. ఇప్పటికే జంగిల్ క్లియరెన్స్ పనులు పూర్తయిన నేపథ్యంలో అంతర్గత రహదారుల ఏర్పాటు, ఇంటి స్థలాల మార్కింగ్, స్టోన్ ప్లాంటేషన్, నంబరింగ్ పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. అభివృద్ధి పనుల నిర్వహణను లే అవుట్ ప్రత్యేక అధికారులు రెవెన్యూ, ఇంజినీరింగ్ అధికారులను సమన్వయం చేసుకుంటూ నిర్దేశిత సమయంలో సక్రమంగా పనులు పూర్తయ్యేలా ప్రణాళికా ప్రకారం చర్యలు తీసుకోవాలని సూచించారు.

లే అవుట్ల పరిశీలనా కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్లు సాయిశ్రీ, సీఆర్‌డీఏ, రెవెన్యూ, సర్వే, ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

జగనన్న హామీ నెరవేరింది

- బాధితుడి చేతికి ఇంటి పట్టా అందజేసిన జిల్లా కలెక్టర్
- సీఎం హామీని నెరవేర్చిన పల్నాడు జిల్లా యంత్రాంగం



కలెక్టరేట్‌లో బాధితుడు రమేష్‌కు ఇంటిస్థలం పట్టాను అందజేస్తున్న జిల్లా కలెక్టర్ శివశంకర్

నరసరావుపేట: ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి స్వయంగా ఇచ్చిన ఇంటి స్థలం హామీని పల్నాడు జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ ప్రభుత్వం ద్వారా నెరవేర్చారు. ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ కార్యక్రమాన్ని ప్రారంభించేందుకు పల్నాడు జిల్లా పర్యటనకు గత నెల ఆరున వచ్చిన సీఎం జగన్ సమక్షంలో చిలకలూరిపేట మండలం కావూరు గ్రామానికి చెందిన ముచ్చు రమేష్ భారీ బహిరంగ సభలో మాట్లాడుతూ తన అనారోగ్య సమస్య (డయాలసిస్)ను పరిష్కరించాలని, తనకు ఇల్లు లేదని ఇంటి స్థలం ఇప్పించాలని విన్నవించాడు. దీనిపై సీఎం ఆరోగ్యశ్రీ ద్వారా వైద్యసేవలు కలిగించి, బాధితునికి ఇంటి స్థలం ఇప్పించాలని జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు. ఆ ఆదేశాలను పురస్కరించుకొని బాధితుడు రమేష్‌కు సొంత గ్రామం కావూరులో ఒకటిన్నర సెంట్ల ఇంటిస్థలం కేటాయించి, పట్టాను మంగళవారం కలెక్టరేట్‌లో అందజేశారు. వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ద్వారా తనకు వైద్య ఆరోగ్య శాఖ విభాగం వైద్యసేవలు అందిస్తున్నట్లు బాధితుడు పేర్కొన్నారు. ముఖ్యమంత్రి అందించిన సాయం జీవితంలో ఎప్పటికీ మర్చిపోలేమని, సర్వదా రుణపడి ఉంటామని రమేష్ కుటుంబ సభ్యులు సంతోషం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి ఆదేశాలను అనుసరించి తమకు మేలు చేసిన జిల్లా కలెక్టర్ శివశంకర్, ఆరోగ్యశ్రీ జిల్లా కో ఆర్డినేటర్ డాక్టర్ సునీల సహకారం మరువలేమంటూ ధన్యవాదాలు తెలిపారు.

ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్ల పరిశీలన

పార్కింగ్ స్థలాన్ని పరిశీలించిన ఎంపీ



నిజాంపట్నంలో పార్కింగ్ స్థలాన్ని పరిశీలిస్తున్న ఎంపీ మోపిదేవి వెంకట రమణారావు

నిజాంపట్నం: వైఎస్సార్ మత్స్యకార భరోసా నగదు పంపిణీ కార్యక్రమాన్ని ఈనెల 15వ తేదీ నిజాంపట్నంలో ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి ప్రారంభించనున్నట్లు జాయింట్ కలెక్టర్ శ్రీధర్ తెలిపారు. నిజాంపట్నంలో మంగళవారం పర్యటించి సీఎం సభాస్థలి ప్రాంగణాన్ని, హెలీప్యాడ్ ప్రాంగణాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా పలుశాఖల అధికారులతో సమావేశం నిర్వహించి ఆయాశాఖల అధికారులు చేపట్టవల్సిన పనులపై సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో రేపల్లె ఆర్డీవో పార్థసారధి, ఎంపీపీ మోపిదేవి విజయనిర్మల హరనాధబాబు, జెడ్పీటీసీ నర్రా సుబ్బయ్య, తహసీల్దార్ శిరీష, ఎంపీడీవో నాగలక్ష్మీ, పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.

ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు

15వ తేదీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి నిజాంపట్నం రానున్న సందర్భంగా అందుకు సంబంధించిన ఏర్పాట్లను ఎంపీ మోపిదేవి వెంకట రమణారావు పరిశీలించారు. ఈ కార్యక్రమానికి వేలాది సంఖ్యలో ప్రజలు వచ్చే అవకాశం ఉంది. అయితే వాహనాల్లో తరలివచ్చే ప్రజలకు పార్కింగ్ ఏ ప్రాంతంలో స్థలాన్ని కేటాయించాలి అనే విషయంపై స్థానిక ప్రజాప్రతినిధులతో, అధికారులతో చర్చించి పార్కింగ్ స్థలాన్ని పరిశీలించారు.

షబీనాకు ఘనస్వాగతం

- ఆసియా పోటీల్లో సత్తాచూపిన క్రీడాకారిణి
- ఆర్టీసీ బస్టాండు నుంచి నివాసం వరకు కొనసాగిన ర్యాలీ
- కామన్‌వెల్త్‌లో పతకం కొట్టటమే లక్ష్యమన్న షబీనా



టాప్‌లేని జీపులో జాతీయజెండాతో షబీనా

తెనాలి: అంతర్జాతీయస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో నాలుగు బంగారు పతకాలను కైవసం చేసుకుని స్వస్థలానికి తిరిగి వచ్చిన పట్టణ లిఫ్టర్ షేక్ షబీనాకు తెనాలిలో ఘనస్వాగతం లభించింది. కేరళ రాష్ట్రం అలెప్పీలో ఈనెల ఒకటో తేదీ నుంచి ఆరో తేదీ వరకు జరిగిన ఆసియా పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో షబీనా 84 కిలోల కేటగిరీలో తలపడి, స్క్వాట్, బెంచ్‌ప్రెస్, డెడ్‌లిఫ్ట్‌లో ప్రథమ స్థానంలో నిలిచి, ఓవరాల్‌గా అగ్రగామిగా నాలుగు విభాగాల్లోనూ బంగారు పతకాలను గెలుచుకున్న విషయం తెలిసిందే. ఇంటర్ పూర్తయే సరికి అంతర్జాతీయస్థాయిలో పతకాలను సాధించిన షబీనా, కేరళ నుంచి మంగళవారం తెనాలికి తిరిగొచ్చింది. స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్ద స్థానికులు తనకు ఘనస్వాగతం పలికారు. అక్కడి నుంచి షబీనా నివాసమైన సీబీఎన్ కాలనీ వరకు ర్యాలీ నిర్వహించారు. టాపులేని జీపులో నిలబడి, జాతీయ జెండాతో షబీనా అందరికీ అభివాదం చేస్తూ ముందుకు సాగింది. ర్యాలీకి ముందు భాగాన డప్పుల విన్యాసం కొనసాగింది. తల్లిదండ్రులు షంషద్, బుజ్జి, కోచ్ ఎస్‌కే సంధానితో సహా వచ్చిన షబీనాకు పట్టణానికి చెందిన వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు షేక్ దుబాయ్‌బాబు, మొగల్ అహ్మద్, టీడీపీ నేత మహమ్మద్ ఖుద్దూస్‌లు స్వాగతం పలికారు. భారతదేశానికి పతకాలను సాధించి, తెనాలికి పవర్ లిఫ్టింగ్‌లో గల ఘనకీర్తిని నిలిపిన క్రీడాకారిణిగా అభినందనలతో ముంచెత్తారు. దారిపొడవునా పలువురు పూలమాలలతో అభినందించారు. ఈ సందర్భంగా షబీనా మాట్లాడుతూ అంతర్జాతీయ పతకాల సాధనే లక్ష్యంగా కష్టమైనప్పటికీ పట్టుదలతో సాధన చేశానని చెప్పింది. ఆశించిన విధంగానే ఆసియా స్థాయిలో పతకాలను సాధించగలిగినట్టు తెలిపింది. ప్రపంచ పోటీలు, కామన్‌వెల్త్ గేమ్స్‌లోనూ పతకాలను సాధించాలనేది తన లక్ష్యంగా చెప్పారు. తనను ప్రోత్సహించి, ఆశీర్వదిస్తున్న అందరికీ ధన్యవాదాలు తెలియజేసింది. వీరితో పాటు రహంతుల్లా, కరిముల్లా, జాఫర్, పినపాటి రవీంద్ర, జగన్, ఫణిదపు దుర్గా, చల్లగాలి శివశంకర్, ముజీబ్ ప్రభృతులు పాల్గొన్నారు.



షబీనాకు స్వాగతం పలికిన ముస్లిం మైనారిటీ నాయకులు

టెన్త్ సప్లిమెంటరీకి ఫీజు కట్టించండి

హెచ్‌ఎంలకు డీఈవో ఆదేశం

గుంటూరు ఎడ్యుకేషన్: పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో తప్పిన విద్యార్థులకు జూన్ 2వ తేదీ నుంచి జరగనున్న సప్లిమెంటరీ పరీక్షల ఫీజును ఈనెల 17వ తేదీలోపు ఫీజు చెల్లించే విధంగా ప్రధానోపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి పి.శైలజ ఆదేశించారు. మంగళవారం గుంటూరు రూరల్ అంకిరెడ్డిపాలెంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న నాడు-నేడు పనులను ఆమె పరిశీలించారు. ఈసందర్భంగా విద్యార్థులు కూర్చునేందుకు సరఫరాదారుల నుంచి వచ్చిన బెంచీలు, బల్లల మెటీరియల్ నాణ్యతను పరిశీలించారు. నాడు-నేడు పనుల నాణ్యతలో ఎటువంటి రాజీపడవద్దని ఆమె హెచ్‌ఎంకు సూచించారు. ఈ సందర్భంగా టెన్త్, ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలకు హాజరు కానున్న విద్యార్థులకు పాఠశాలలో నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులను పరిశీలించిన డీఈవో శైలజ ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు.

కామాంధుడికి యావజ్జీవ శిక్ష

చీరాల: బాలికపై అత్యాచార కేసులో వ్యక్తికి యావజ్జీవ కారాగార జైలు శిక్షను విధిస్తూ న్యాయమూర్తి మంగళవారం తీర్పును వెలువరించారు. వివరాల్లోకి వెళితే..

గతేడాది జనవరి 4న వేటపాలెంలోని మంకెన వారిపాలెంలో మూడో తరగతి చదువుతున్న బాలికను ఇంటి సమీపంలో ఉండే మంకెన జయరావు తన ఇంట్లోకి పిలిచి బాలికపై అత్యాచారం చేశాడు. బాలిక తనపై జరిగిన లైంగిక దాడిని గురించి చిన్నమ్మకి చెప్పింది. దీంతో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేయగా బాధితురాలిని వైద్యపరీక్షల నిమిత్తం చీరాల ఏరియా వైద్యశాలకు తరలించి మెరుగైన చికిత్స నిమిత్తం ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. బాలిక చిన్నమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు వేటపాలెం ఎస్సై జి.సురేష్ కేసు నమోదు చేశారు. అప్పటి చీరాల డీఎస్పీ పీ శ్రీకాంత్ దర్యాప్తు చేసి నిందుతుడిని అరెస్ట్ చేశారు. కేసును ఒంగోలు 2వ ఏడీజే, పోక్సో కోర్టులో విచారణకు రాగా జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ స్వీయ పర్యవేక్షణలో చీరాల రూరల్ సీఐ మల్లికార్జునరావు, వేటపాలెం ఎస్సై జి.సురేష్, కోర్టు కానిస్టేబుల్ ఎస్కే కరిముల్లాలు సాక్షులను కోర్టులో హాజరుపరిచారు. స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కేవీ రామేశ్వరరెడ్డి కోర్టులో వాదించి నిందితుడిపై నేరాన్ని నిరూపించారు. ఒంగోలు 2వ ఏడీజే, పోక్సో కోర్టు న్యాయమూర్తి ఎంఏ సోమశేఖర్ మంగళవారం నిందితుడు మంకెన జయరావుకు యావజ్జీవ కారాగార జైలు శిక్ష, రూ.2 వేలు జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు. అలాగే బాధితురాలికి చదువు, ఇతర అవసరాల నిమిత్తం రూ.2 లక్షలు, ముద్దాయి చెల్లించే జరిమానా డబ్బు కూడా బాధితురాలికి ఇవ్వమని ఉత్తర్వులు జారీ చేశారు. ఎస్పీ జిందాల్ మాట్లాడుతూ డీజీపీ ఆదేశాల మేరకు బాలికలపై, మహిళలపై జరుగుతున్న నేరాలను వేగంగా దర్యాప్తు చేసి నిర్ణీత గడువులోపు సంబంధిత కోర్టులో చార్జిషీటు దాఖలు చేసి విచారణను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నామన్నారు. మహిళలు, బాలికలపై చెడు ఉద్దేశంతో ప్రవర్తించే వారిని ఉపేక్షించేది లేదన్నారు. కేసులో ముద్దాయికి జైలు శిక్ష పడేలా చర్యలు తీసుకున్న పోలీసు సిబ్బందిని అభినందించారు.

'మిడిల్‌క్లాస్ మెలోడీస్' గోపరాజు

- నాటక రంగం నుంచి అంచెలంచెలుగా..
- సినిమాలు, సీరియల్స్‌లో బిజీ
- కలలో కూడా ఊహించలేని అదృష్టం: సినీనటుడు గోపరాజు రమణ


గోపరాజు రమణ

సాక్షి ఇంటర్వ్యూ

తెనాలి: 'ఒక్క ఛాన్స్'.. సినీప్రపంచంలో ఎందరో కోరుకునే అవకాశం. ఛాన్స్ వచ్చి నిరూపించుకున్న నటీనటులకు తిరుగుండదు. అవకాశాలు క్యూ కడతాయి. బిజీ ఆర్టిస్టును చేసే స్థాయి. రంగస్థలం, రేడియో, టీవీ, సినిమా నటుడు గోపరాజు రమణ ఇందుకో నిదర్శనం. 'మిడిల్‌క్లాస్ మెలోడీస్'లో హీరో తండ్రి కొండల రావు పాత్రలో ఆ సినిమాకు ప్రాణం పోశారు రమణ. ఆ ఛాన్స్ ఆయన కెరీర్‌ను మలుపు తిప్పింది. కరోనా సమయంలో ఓటీటీలో రిలీజైన ఆ సినిమాతో దాదాపు రెండున్నరేళ్లలో నలభై సినిమాల్లో నటించేంత బిజీ అయ్యారు. 69 ఏళ్ల వయసులో నిత్యం సినిమా షూటింగులతో తీరిక లేకుండా గడుపుతున్న రమణ, ఎన్టీఆర్ శతాబ్ది రంగస్థల పురస్కారాన్ని తెనాలిలో స్వీకరించారు. ఈ సందర్భంగా సొంతూరు కొలకలూరులో 'సాక్షి'కిచ్చిన ఇంటర్వ్యూ...

ఎన్టీఆర్ పురస్కారంతో..

ఎన్టీఆర్ పేరుతో రంగస్థల పురస్కారం నా జీవితానికో గొప్ప వరం... అదృష్టం. ఆ మహానటుడి శతజయంతి ఉత్సవాల్లో నన్నూ భాగస్వామిని చేసినందుకు సంతోషం. పాత సినిమాలు గైడ్‌లాంటివి. ఎన్టీఆర్ సినిమాలు మరీ ప్రత్యేకం. ఆయన వాయిస్ కల్చర్ గొప్పది. పాత్రలో పరకాయ ప్రవేశం చేసేలా డైలాగ్ మాడ్యులేషన్ ఉంటుంది. 'దానవీరశూర కర్ణ'లో దుర్యోధనుడు, కర్ణుడు, శ్రీకృష్ణుడు పాత్రల్లో, వైరుధ్యమైన డైలాగ్ డెలివరీ ఆయనకే చెల్లింది. ఆయన ప్రభావం నాపైనే కాదు... చాలామందిపై ఉంటుంది.

ఎన్ని సినిమాల్లో నటించారు..

రంగస్థల నాటకాలు, రేడియో, టీవీ సీరియల్స్ చేస్తూ ఏడాదికి ఒకటో రెండో సినిమాలు చేస్తున్నా. 'ఓ పనైపోతుంది బాబూ' నా తొలి సినిమా. 15 సినిమాల్లో నటించాను. ఇంద్రగంటి మోహనకృష్ణ 'గ్రహణం'తో పేరొచ్చినా, పెద్దగా అవకాశాలు రాలేదు. కరోనా రోజుల్లో ఇక నాటకాలు, టీవీ షూటింగులు తగ్గించుకుంటూ రిలాక్సయిపోయి, నాటకాల్లో మాత్రమే చేద్దామని అనుకున్నాను. అప్పుడే ఓ మంచి అవకాశం తలుపు తట్టింది.

'మిడిల్‌క్లాస్ మెలోడీస్' హిట్..

సాఫ్ట్‌వేర్ నుంచి షార్ట్ ఫిలింస్ మీదుగా సినిమాల్లోకి వచ్చిన దర్శకుడు వినోద్ అనంతోజు తొలి ప్రయోగం 'మిడిల్‌క్లాస్ మెలోడీస్'. ఈ గుంటూరు కుర్రోడి నుంచి ఓ రోజు నాకు ఫోనొచ్చింది...'మేం చేసే సినిమాలో ఒక పాత్రకు మిమ్మల్ని అనుకున్నాం' అని. ఆయన కథ చెప్పిన విధానం, శ్రద్ధ నచ్చింది. భవ్య క్రియేషన్స్ అన్నే రవికుమార్ ఈ సినిమాకు ఎగ్జిక్యూటివ్ నిర్మాత. కొత్త నటుల కోసం చేసిన అన్వేషణలో రవీంద్రభారతిలో జరుగుతున్న పరిషత్ పోటీలను చూశారు.' తలుపులు తెరిచేఉన్నాయి' నాటికలో నన్ను చూసి పిలిపించారు. మా అబ్బాయి సలహాపై మా సొంతూరులో పరిషత్ నాటకాలను కూడా చూడమన్న సూచనతో కొలకలూరు వచ్చారు. నాటకాలు చూశారు. నాతో పాటు ప్రభావతి, ఆంటోనీ వంటి కళాకారులను తీసుకున్నారు.

మీ స్టైల్ మారిపోతుందన్నారు..

ఆ సినిమాను కొలకలూరు, గుంటూరులోనే తీశారు. అప్పట్లో 'సినిమా రిలీజయ్యాక మీ స్టైల్ మారిపోతుంది... మాకు దొరకరు' అనేవారు రవికుమార్. 2020 నవంబరులో ఓటీటీలో సినిమా రిలీజైంది. పది రోజుల్లోనే సినిమా హాట్ టాపిక్కయింది. నాటకం నేర్పిన దర్శకులు, టీవీ, సినిమాల్లో అవకాశాలు ఇచ్చినవారు అభినందించారు. కొండలరావు పాత్రలో సొంత తండ్రినో, బాబాయినో చూసినట్టుగా ఉన్నారని ఎవరెవరో ఫోన్లు చేస్తుంటే ఆ ఆనందాన్ని తట్టుకోలేకపోయాను.

'ఆహా' నా డేట్స్ కోసం..

కట్‌చేస్తే, ఆ సినిమా తర్వాత 40 సినిమాలు చేశానంటే ఆశ్చర్యం వేస్తోంది. కొన్ని వేరియేషన్స్‌తో ఇంచుమించు అలాంటి పాత్రలే వచ్చాయి. రిటైరవాలని అనుకున్న నేను, నిత్యం షూటింగులు, ప్రయాణాలతో తీరికలేకుండా ఉంటానని కలలో కూడా ఊహించలేదు. దర్శకుడికి నా పాత్రపై ఉన్న ఆలోచనను తెలుసుకుని, అందుకనుగుణంగా నటిస్తున్నాను. ఈ క్రమంలో ఆహా వారి 'త్రీ రోజెస్', కోనా ఫిలింస్ 'పులిమేక' వంటి వెబ్‌సిరీస్‌లోనూ నటించి మంచి పేరు తెచ్చుకున్నాను. 'ఆహా' వాళ్లు నా డేట్స్ కోసం కొన్నాళ్లు ఆగి మరీ అవకాశం ఇచ్చారు.

నాటకం నాకు అమ్మలాంటిది. నాటకం ఆడే పరిస్థితి వస్తుందా? లేదా? అనేది ఇప్పుడు చెప్పలేను. చేస్తున్న సినిమాల్లో సక్సెస్ ఎలాగనేదే తపన మినహా వెనక్కు వెళ్లాలని లేదు. మనసు సహకరిస్తోంది... ఉత్సాహం పెరుగుతోంది. సినిమాలకు విరామం వచ్చిన రోజున నాటకాలు తప్పకుండా ఆడతాను. సినిమా రంగంలోనివారు పరిషత్ నాటకాలను చూస్తే బాగుంటుంది. అక్కడ మంచి నటీనటులను ఎంచుకోవచ్చు. కొత్తవారికి అవకాశాలు ఇచ్చినట్టూ ఉంటుంది.

హైవేపై బ్యాటరీల లోడు లారీ బోల్తా



యనమదల (ప్రత్తిపాడు): బ్యాటరీల లోడు లారీ అదుపు తప్పి బోల్తా కొట్టిన ఘటన చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు.. గుంటూరు వైపు నుంచి బ్యాటరీల లోడుతో చిలకలూరిపేట వైపు వెళుతున్న లారీ ప్రత్తిపాడు మండలం యనమదల జాతీయ రహదారిపై మంగళవారం ఉదయం అదుపుతప్పి బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో బ్యాటరీలు చెల్లాచెదురుగా రోడ్డుపై పడిపోయాయి. ఎవ్వరికీ ఎలాంటి ప్రాణాపాయం జరగలేదు. లారీ సిబ్బంది బ్యాటరీలను సురక్షితంగా పక్కన భద్రపరుచుకున్నారు. అయితే బ్యాటరీల లోడుతో లారీ వెస్ట్ బెంగాల్‌కు వెళుతున్నట్లు సమాచారం.

'పెట్రో' ఉత్పత్తులపై అవగాహన

తాడేపల్లిరూరల్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం చమురు, గ్యాస్ సంరక్షణపై నిర్వహిస్తున్న అవగాహన కార్యక్రమం మంగళవారంతో ముగిసింది. తాడేపల్లి హెచ్‌పీసీఎల్ విజయవాడ రిటైల్ ప్రాంతీయ కార్యాలయం వద్ద నిర్వహించిన ముగింపు కార్యక్రమానికి చమురు పరిశ్రమ రాష్ట్రస్థాయి కో-ఆర్డినేటర్ జె. సంజయ్‌కుమార్, ఆంధ్రప్రదేశ్ సోలార్ పవర్ మేనేజింగ్ డైరెక్టర్ మరియు చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ డాక్టర్ ఎం.కమలాకర్‌బాబు హాజరయ్యారు. సంజయ్ కుమార్ మాట్లాడుతూ సక్షం-2023 కింద పాఠశాలలు, కళాశాలల్లో గ్రూప్‌టాక్, డిబేట్లు, వాల్ పెయింటింగ్‌లు, రైతులు మరియు ట్రక్ డ్రైవర్లతో అవగాహన కార్యక్రమాలు నిర్వహించామని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ సోలార్ పవర్ మేనేజింగ్ డైరెక్టర్, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ డాక్టర్ ఎం.కమలాకర్‌బాబు మాట్లాడుతూ పెట్రోలియం ఉత్పత్తులపై ప్రజల అవగాహనలో మార్పు రావాలని ఆశిస్తున్నామన్నారు. సంప్రదాయేతర వనరులు 2070 నాటికి నెట్‌జీరో సాధించడానికి కాలుష్యం మరియు కార్బన్ ఉద్గారాలు తగ్గించేలా ప్రణాళిక రూపొందించామని అన్నారు. ఎలక్ట్రికల్ వాహనాల వినియోగాన్ని పెంచాలని సూచించారు. అనంతరం పాఠశాలలు, కళాశాలల్లో వాల్ పెయింటింగ్‌ల్లో విజేతలకు గ్రాఫిటీ అవార్డు, గ్రూప్ టాక్, డిబేట్లు, వాల్ పెయింటింగ్‌లో పాల్గొన్న వారికి పార్టిసిపేషన్ సర్టిఫికెట్లు, మెమెంటోలు అందజేశారు.

ఇక్బాల్ మసీదు స్వాధీనం

లక్ష్మీపురం: గుంటూరు నగరంలోని తూర్పు నియోజకవర్గ పరిధిలోని ఇక్బల్ మసీదును ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వక్ఫ్ బోర్డు ముఖ్యకార్య నిర్వాహణ అధికారి ఆదేశాల మేరకు వక్ఫ్ బోర్డు ఆధీనంలో తీసుకున్నట్లు జిల్లా వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్ ముక్తార్ బాషా మంగళవారం తెలిపారు. మసీదు కమిటీ అధ్యక్షుడుగా వ్యవహరిస్తున్న జుబేర్ ఖాన్ నుంచి మసీదు నిర్వహణ బాధ్యతలను ప్రభుత్వ నిబంధనలు మేరకు చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. ఇక నుంచి మసీదుకు సంబంధించిన వ్యవహారాలన్నీ వక్ఫ్‌బోర్డు పూర్తిగా బాధ్యత వహిస్తుందని వివరించారు. మసీదుకు సంబంధించిన అద్దెదారులకు, ఇప్పటికి నోటీసులు కూడా జారీ చేసి తెలియపరచడం జరిగిందని తెలిపారు. ఎవరికైన ఎటువంటి అవసరం వచ్చిన 8374999586ను నేరుగా సంప్రదించాల్సిందిగా కోరారు. మసీదును స్వాధీనం చేసుకున్న ప్రక్రియలో జిల్లా వక్ఫ్‌బోర్డు కమిటీ అధ్యక్షులు జిలానీ, కార్యదర్శి సమీవుల్లా పాల్గొన్నారు.

విజ్ఞాన్‌తో అడివర్స్ టెక్నాలజీస్ అవగాహన ఒప్పందం


అవగాహన ఒప్పంద పత్రాలు అందుకుంటున్న చైర్మన్ లావు రత్తయ్య

చేబ్రోలు: మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలోని ఐక్యూఏసీతో హైదరాబాద్‌లోని అడివర్స్ టెక్నాలజీస్ అవగాహన ఒప్పందం కుదుర్చుకుందని వీసీ పీ నాగభూషణ్ మంగళవారం తెలిపారు. అడివర్స్ టెక్నాలజీస్ సంస్థకు చెందిన ప్లాట్‌ఫాంను విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్మన్ లావు రత్తయ్య ప్రారంభించారు. నాగభూషణ్ మాట్లాడుతూ అడివర్స్ టెక్నాలజీస్‌కు యూఎస్‌ఏలోని వర్జీనియాలో బ్రాంచ్ ఉందన్నారు. ఈ అవగాహన ఒప్పందం వలన అడివర్స్ టెక్నాలజీస్ సంస్థ విజ్ఞాన్ గ్రూప్ సంస్థల అక్రిడిటేషన్, ర్యాంకింగ్ ప్లాట్‌ఫాంలను ఆటోమేట్ చేయడానికి సహకరిస్తుందన్నారు. వార్షిక ప్రాతిపదికన సమర్పించే ఏక్యూఆర్ రిపోర్ట్ సమర్పించడంలో విజ్ఞాన్ సంస్థలకు మద్దతు ఇస్తుందని వివరించారు. ఈ సంస్థ ఐఐక్యూఏ, ఎస్ఎస్ఆర్ ప్రిపరేషన్‌లోని క్వాలిటేటివ్ మరియు క్వాంటిటేటివ్ మెట్రిక్ ప్రిపరేషన్ రెండింటిలోనూ తోడ్పాటునందిస్తుందన్నారు. అడివర్స్ టెక్నాలజీస్‌కు ఇప్పటికే ఫ్యాకల్టీ డాష్‌బోర్డ్, నాక్, ఎన్ఐఆర్ఎఫ్, ఎన్‌బీఏ వంటి అన్ని ఇండియన్ అక్రిడిటేషన్‌లను సాధించిందని వెల్లడించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ లావు శ్రీకృష్ణదేవరాయలు పాల్గొన్నారు.

రక్తహీనతను పటిష్టంగా ఎదుర్కోవాలి

కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి


అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి

గుంటూరు వెస్ట్: మహిళల్లో ముఖ్యంగా గర్భిణుల్లో, చిన్నారుల్లో రక్తహీనత నుంచి కాపాడేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి కోరారు. స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో సమావేశ మందిరంలో అధికారుల సమావేశం మంగళవారం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ రక్తహీనత ఉన్న మహిళలను గుర్తించి వారికి బర్త్ ప్లానింగ్‌తోపాటు సమీపంలోని పీహెచ్‌సీకి ట్యాగింగ్ చేయాలన్నారు. వారు ప్రతి రోజూ సమీపంలోని అంగన్‌వాడీలో పౌష్టికాహారం తీసుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రతి నెలా షుగర్, బీపీ పరీక్షలు నిర్వహించాలన్నారు. వైద్యశాఖలో ఖాళీగా ఉన్న అన్ని పోస్టులను తక్షణం భర్తీ చేయాలని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో 8,9,10 తరగతులు పూర్తి చేసిన వారు తదుపరి తరగతుల్లో చేరే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. మనబడి నాడు-నేడులో భాగంగా అభివృద్ధి కోసం మంజూరు చేసిన పనులను నిర్దేశిత సమయంలో పూర్తి చేయాలని సూచించారు. సమావేశంలో జిల్లా వైద్యశాఖాధికారి ఏ శ్రావణ్ బాబు, డీపీఎంఓ డాక్టర్ చుక్కా రత్న మన్‌మోహన్, ఐసీడీఎస్ పీడీ మనోరంజని, డీఈఓ శైలజ పాల్గొన్నారు.

వృద్ధులకు కంటి పరీక్షలు చేయాలి

గుంటూరు వెస్ట్: వైఎస్సార్ కంటి వెలుగు మూడో విడత కార్యక్రమంలో 60 ఏళ్లు నిండిన వృద్ధులకు పరీక్షలు నిర్దేశించిన సమయంలోనే పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో సమావేశ మందిరంలో నిర్వహించిన అధికారుల సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. ఇప్పటికే తొలి, మలి విడత కంటి పరీక్షల్లో 60 శాతం మంది వృద్ధులకు ప్రాథమిక పరీక్షలు పూర్తి చేసినట్లు చెప్పారు. మిగిలిన వారికి కూడా జూన్ నాటికి పూర్తి చేయాలన్నారు.

హజ్ యాత్రికులు ఆందోళన చెందవద్దు

- టికెట్ ధరలపై కేంద్రంతో మాట్లాడుతున్నాం
- త్వరలో సానుకూల నిర్ణయం వెలువడుతుంది
- రాష్ట్ర మైనారిటీ వ్యవహారాల సలహాదారు ఎస్ఎం జియావుద్దీన్



లక్ష్మీపురం: పవిత్ర హజ్ యాత్రకు సంబంధించి సెంట్రల్ హజ్ కమిటీ నిర్ణయించిన టికెట్ ధరలపై హజ్ యాత్రికులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని రాష్ట్ర మైనారిటీ వ్యవహరాల సలహాదారు ఎస్ఎం జియావుద్దీన్ తెలిపారు. స్థానిక బీఆర్ స్టేడియం వద ఉన్న ఆయన కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వ కృషి మేరకు ఈ ఏడాది కొత్తగా విజయవాడను ఎంబార్కేషన్ పాయింట్‌గా కేంద్ర ప్రభుత్వం, రాష్ట్రం నుంచి హజ్ యాత్ర చేసే ముస్లింల సౌకర్యార్థం ఏర్పాటు చేసిందన్నారు. సెంట్రల్ హజ్ కమిటీ నిర్ణయించిన ధరలు అభ్యంతరకంగా ఉన్నాయన్నారు. హైదరాబాద్ నుంచి యాత్ర చేసేవారికి రూ.3.04 లక్షలు, విజయవాడ నుంచి యాత్ర చేసేవారికి రూ.3.88 లక్షల ధర నిర్ణయించడంతో ఆందోళన మొదలైందన్నారు. ఈ సమస్యపై రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే చర్యలు చేపట్టిందని, ఉప ముఖ్యమంత్రి అంజాద్ బాషాతో పాటు రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్ బి.గౌసుల్‌ఆజమ్‌లు ఢిల్లీలో సంబంధిత మంత్రిత్వ శాఖతో సంప్రదింపులు జరుపుతున్నారని చెప్పారు. టికెట్ ధరలను తగ్గించాలని, లేని పక్షంలో ఎంబార్కేషన్ పాయింట్‌ను మార్చేవిధంగా చర్యలు చేపట్టాలని కేంద్ర ప్రభుత్వాన్ని వారు కోరనున్నారని తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల ప్రకారం కేంద్రమంత్రి స్మృతి ఇరానీని కలిసి ధరలు తగ్గించే విధంగా చర్యలు చేపట్టేందుకు వారిద్దరూ ఢిల్లీలోనే ఉన్నారని చెప్పారు. హజ్ యాత్రకు ధరలు నిర్ణయించేది సెంట్రల్ హజ్ కమిటీ అని ఇందులో రాష్ట్ర కమిటీకి కాని, రాష్ట్ర ప్రభుత్వానికి గానీ ఎలాంటి సంబంధం ఉండదని వివరించారు. ముస్లిం సమాజం అభ్యున్నతి కోసం పాటు పడే ఈ ప్రభుత్వం హజ్ యాత్రికుల సౌకర్యార్థం ఎంత ఖర్చు చేయడానికైనా వెనుకాడదన్నారు. ముస్లింలు అత్యంత పవిత్రంగా భావించే హజ్‌యాత్రను రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకోవడం సరికాదన్నారు. ముస్లింలు ఎవరూ యాత్రకు సంబంధించిన ఏ విషయంలోనూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. సీఎం సానుకూల నిర్ణయం తీసుకుంటారని తెలిపారు.

విశ్రాంత సైనికులపై ప్రత్యేక శ్రద్ధ


మేజర్ జనరల్ రాకేష్ మనోచ


మాజీ సైనికునితో మాట్లాడున్న మేజర్ జనరల్ రాకేష్ మనోచ

గుంటూరు ఎడ్యుకేషన్: మాజీ సైనికులతో పాటు వారి కుటుంబాల సాంఘిక భద్రత, సంక్షేమం, ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నట్లు ఆంధ్ర, తెలంగాణ సబ్ ఏరియా కమాండింగ్ అధికారి మేజర్ జనరల్ రాకేష్ మనోచ పేర్కొన్నారు. మంగళవారం శ్యామలానగర్‌లోని మాజీ సైనికుల ఆరోగ్య సేవ కేంద్రాన్ని సందర్శించిన మనోచ ఇటీవల ఏర్పాటు చేసిన ఫార్మసీ, ఫిజియోథెరపీ విభాగాలను, సైనికుల విశ్రాంతి హాలును పరిశీలించారు. క్యాంటిన్ ద్వారా సైనికులకు అందుతున్న సేవల గురించి తెలుసుకున్నారు. అనంతరం హిందూ కళాశాల ఎదురుగా ఉన్న జిల్లా మాజీ సైనిక సంక్షేమ కార్యాలయాన్ని సందర్శించి అమరవీరుల స్థూపానికి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మేజర్ జనరల్ రాకేష్ మనోచ మాట్లాడుతూ ఉమ్మడి గుంటూరు జిల్లావ్యాప్తంగా ఉన్న 30వేల మంది విశ్రాంతి సైనికుల సంక్షేమంపై ప్రత్యేక శ్రద్ధ కనపరుస్తామని, సమస్యలు ఉన్నట్లయితే నేరుగా తమ దృష్టికి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. ఎన్‌సీసీ గ్రూప్ కమాండర్ కల్నల్ ఎస్.ఎం.చంద్రశేఖర్, ఆరోగ్య కేంద్ర పరిపాలనాధికారి కల్నల్ సుధాకర్, ఎన్‌సీసీ క్యాంటిన్, సబ్ ఏరియా క్యాంటిన్ మేనేజర్లు, విశ్రాంత సైనికుల సంఘ నాయకులు పాల్గొన్నారు.

ఎన్నారై వివాహాలపై పూర్తి సమాచారం అవసరం

మహిళా కమిషన్ చైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మ



ఏఎన్‌యూ: ఎన్నారై వివాహాల విషయంలో పిల్లల తల్లిదండ్రులు వాస్తవాలు తెలుసుకుని నిర్ణయాలు తీసుకోవాలని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మ అన్నారు. ఏపీ సీఐడీ విభాగం ఆధ్వర్యంలో ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో 'ఎన్ఆర్ఐ వివాహ అంశాలలో భారతీయ మహిళల హక్కులపై సామాజిక- చట్టపరమైన సాధికారిత' అనే అంశంపై మంగళవారం సదస్సు నిర్వహించారు. వాసిరెడ్డి పద్మ ప్రసంగిస్తూ ఎన్నారై వివాహాల సమస్యల పరిష్కారానికి మహిళా పోలీసులు, వలంటీర్ల సేవలు అభినందనీయమన్నారు. తల్లిదండ్రులు అవసరమైతే ఆయా దేశాల్లో ఉన్న తెలుగు అసోసియేషన్ల సహకారం తీసుకోవాలని సూచించారు. వివాహం అనంతరం చట్టబద్ధత కోసం రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏపీసీఐడీ ఏడీజీ ఎన్.సంజయ్, జాతీయ మహిళా కమిషన్ సంయుక్త కార్యదర్శి ఎ.అశోలి చలై, ఏపీ సీఐడీ ఎస్పీ కేజీవీ సరిత, ఏపీ ప్రభుత్వ సలహాదారు, ఏపీఎస్ఆర్‌టీ సొసైటీ అధ్యక్షుడు వెంకట్ ఎస్.మేడపాటి, సీఐడీ న్యాయసలహాదారు ఎం.లక్ష్మణరావు, సోషియాలజీ, సోషల్ వర్క్ విభాగ అధ్యాపకురాలు ఆచార్య సరస్వతి రాజు అయ్యర్, లీగల్ స్టడీస్ అధ్యాపకురాలు డాక్టర్ శ్రీగౌరి ప్రసంగించారు.

ఎంటీఎంసీ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడిగా వేమారెడ్డి



పట్నంబజారు: గుంటూరు జిల్లా మంగళగిరి- తాడేపల్లి(ఎంటీఎంసీ) వైఎస్సార్ సీపీ అధ్యక్షుడిగా దొంతిరెడ్డి శంకర్‌రెడ్డి(వేమారెడ్డి)ని నియమిస్తూ పార్టీ కార్యాలయం మంగళవారం ప్రకటన విడుదల చేసింది. వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు అధ్యక్షుడిగా నియమించినట్లు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

రాష్ట్ర చెస్ పోటీలకు క్రీడాకారుల ఎంపిక



గుంటూరు వెస్ట్(క్రీడలు): జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక ఏటీ అగ్రహారంలో జిల్లా సీనియర్ ఓపెన్, ఉమెన్స్ చెస్ పోటీలు ముగిశాయి. సీనియర్ ఓపెన్ విభాగంలో ఎం.మహేంద్ర తేజ, ఆర్.ఆదిత్య, బి.కిరణ్, కె.సౌగంధి. ఉమెన్స్ విభాగంలో ఏ నాగశివ సాయి దివ్య, వి.మోహిత్, కె.వైష్ణవి, సి.హెచ్.రాధిక తొలి నాలుగు స్థానాలు గెలుపొందారు. పోటీల నిర్వాహకుడు షేక్ అబ్దుల్ నభి మాట్లాడుతూ ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 26న విజయవాడలో నిర్వహించనున్న రాష్ట్ర పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. అనంతరం విజేతలకు జిల్లా చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు సి.హెచ్.రవీంద్రరాజు, కోచ్ షేక్ నభిలు బహుమతులు అందజేశారు.

ఉత్సాహంగా ఎడ్ల బండలాగుడు ప్రదర్శన

నందిగామ: మండలంలోని లింగాలపాడులో శ్రీ లక్ష్మీ పేరంటాళ్ల తిరునాళ్ల పురస్కరించుకొని ఉభయ తెలుగు రాష్ట్రాలస్థాయి బండలాగుడు ప్రదర్శన కొనసాగుతోంది. మంగళవారం ఉదయం 2 పళ్ల విభాగంలో బండలాగుడు పోటీలు నిర్వహించారు. ఎనిమిది క్వింటాళ్ల బరువుతో 10 నిమిషాల వ్యవధిలో 3,200 అడుగుల అత్యధిక దూరాన్ని లాగి పల్నాడు జిల్లా శావల్యాపురం మండలానికి చెందిన పరిమి అంజయ్య ఎడ్ల జత మొదటి స్థానంలో నిలిచింది. 3,058 అడుగుల దూరాన్ని లాగి బాపట్ల జిల్లా మార్టూరుకు చెందిన తోట సుబ్బారావు ఎడ్ల జత రెండవస్థానంలో నిలిచింది. గుంటూరు జిల్లా పెదకాకాని మండలం తక్కెళ్లపాడుకు చెందిన నందిపాటి అభిరామ్ ఎడ్ల జత 2,817 అడుగుల దూరాన్ని లాగి మూడో స్థానంలో నిలిచింది. రాత్రి సమయంలో నాలుగు పళ్ల ఎడ్ల జతలకు పోటీలు నిర్వహించారు. పది క్వింటాళ్ల బరువుతో 15 నిమిషాల వ్యవధిలో జరిగే పోటీలలో పది ఎడ్ల జతలు పాల్గొన్నాయి.